ఆర్ఎస్‌సీ యూకే ఫెలోగా సైంటిస్ట్ సిన్హా



లాలాపేట: ఐసీఎంఆర్–ఎన్ఐఎన్‌కు చెందిన సైంటిస్ట్ డాక్టర్. ఎస్.ఎన్ సిన్హా ప్రతిష్ఠాత్మకమైన యూకే రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ(ఆర్ఎస్‌సీ) ఫెలోగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఈయన జాతీయ పోషకాహార సంస్థ(ఎన్ఐఎన్)లో ఫుడ్ సేఫ్టీ విభాగానికి హెడ్‌గా వ్యవహరిస్తున్నారు. సైంటిస్ట్‌గా ఫుడ్ సేఫ్టీలో పురుగుల మందులు, రసాయనాల కాలుష్యంపై తన పరిశోధల ద్వారా ఆహార భద్రతా రంగంలో గణనీయమైన కృషి చేశారు. కార్బోనైటెడ్ పానీయాలలో పురుగుల మందుల గరిష్ట అవశేషాల పరిమితులను నిర్ణయించడానికి క్లిష్టమైన ఆరోగ్య ప్రమాద అంచనా ఫ్రేమ్ వర్క్‌ను అభివృద్ధి చేశా రు. దీనిని భారత ప్రభుత్వం జాయింట్ పార్లమెంట్ కమిటీ సైతం ఆమోదించింది. ఇటీవలే భారతదేశంలోని నేషనల్ అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఫెలోగా ఎన్నికయ్యారు.

గులాబీ గూటికి అసంతృప్తులు!



- కాంగ్రెస్, బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో భారీ చేరికలు
- అలకబూనిన గులాబీ నేతలు

రసూల్‌పురా: ఎన్నికలు సమీపిస్తున్న కొద్ది అసంతృప్తి నేతలు జంప్ జిలానీ బాటపడుతున్నారు. కాంగ్రెస్, బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లోకి ఎక్కువగా చేరుతుండటంతో ఆ పార్టీలో జోష్ కనిపిస్తోంది. మరోవైపు చేరికల జోష్ ఒక ఎత్తయితే పార్టీ కోసం మొదటి నుంచి పని చేసుకుంటూ వస్తున్న గులాబీ నాయకుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. మొన్నటి వరకు వ్యతిరేకంగా పనిచేసిన కాంగ్రెస్, బీజేపీ నుంచి అసంతృప్తి నేతలు చేరుతుండడంతో బీఆర్ఎస్‌కు చెందిన బోర్డు మాజీ సభ్యులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఎన్నికల ముందు కొత్తగా వచ్చి చేరితే తమ పరిస్థితి ఏంటని అభ్యర్థి లాస్య నందితను ప్రశ్నిస్తున్నారు. తమకు సమాచారం లేకుండా ఎలా చర్చలు జరుపుతారని నిర్ణయం ఏ విధంగా తీసుకుంటారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చేరికలపై సమాచారం లేదని ఆగ్రహం..

8వ వార్డుకు చెందిన కాంగ్రెస్ ముఖ్య నాయకుడు జీవీ. బాల్‌రాజ్, సుభాష్‌రెడ్డితో బీఆర్ఎస్ నాయకులు పార్టీలో చేర్చుకునేందుకు చర్చలు జరపగా విషయం తెలుసుకున్న బోర్డు మాజీ సభ్యుడు లోక్‌నాథ్ తీవ్రంగా వ్యతిరేకించమే కాకుండా బాల్‌రాజు పార్టీలో చేరితే తాను పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తానని హెచ్చరించినట్లు సమాచారం. అయితే.. ఒకటో వార్డు నుంచి మైనార్టీ నాయకులు సీరాజ్ మరి కొందరు పార్టీలో చేరడంతో తనకు సమాచారం లేకుండా చేర్చుకున్నారని బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్ రెడ్డి, అభ్యర్థి లాస్య నందిత, ఆమె సోదరి నివేదితపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. అభ్యర్థి తీసుకుంటున్న నిర్ణయాన్ని బోర్డు మాజీ సభ్యులు తీవ్రంగా తప్పుబడుతున్నారు.

రేపు కేటీఆర్ సమక్షంలో భారీ చేరికలు?

క్లాసిక్ గార్డెన్‌లో జరగనున్న బూత్ లేవల్ కమిటీ సమావేశానికి హాజరవుతున్న రాష్ట్ర మంత్రి కేటీఆర్ సమక్షంలో పలువురు కాంగ్రెస్, బీజేపీకి చెందిన నేతలు గులాబీ కండువా కప్పుకోనున్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి టికెట్ ఆశించిన డీబీ దేవేందర్, జీవకన్, పార్టీ సీనియర్ నాయకులు జీవీ బాల్‌రాజ్, బాలంరాయి ప్రమోద్‌కుమార్, గన్‌బజార్‌కు చెందిన వినోద్‌కుమార్. బీజేపీ టికెట్ ఆశించి భంగపడిన విజయరామరాజు, రజినీరెడ్డి, అదే విధంగా సీనియర్ నాయకులు కేబీ. శంకర్రావు కూడా బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు సమాచారం. సామాజిక కార్యకర్త తేలుకుంట సతీష్‌గుప్తా సైతం గులాబీ గూటికి చేరనున్నారు. యువజన నాయకుడు సాయికిరణ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్, బీజేపీకి చెందిన100 మంది యువకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. మరో బీజేపీ సీనియర్ నాయకులు నాయుడు ప్రకాష్ సైతం లైన్‌లో ఉన్నారని వీరందరి చేరికతో బీఆర్ఎస్ పార్టీకి మరింత బలం చేకూరనుందని ఆ పార్టీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ముంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరించాం

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



ఓటేయాలని కోరుతున్న తలసాని శ్రీనివాస్

సనత్‌నగర్: ఎస్ఎన్‌డీపీ కార్యక్రమం కింద రూ.45 కోట్లతో బేగంపేట నాలాను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి వరద ముంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరించామని సనత్‌నగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బేగంపేట డివిజన్‌లని దేవిడి, తబేలా, వికార్‌నగర్, భగవంతాపూర్ లలో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ మాట్లాడారు. గడిచిన తొమ్మిదిన్నర సంవత్సరాలుగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే తిరిగి బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయన్నారు. 2014కు ముందు ఇక్కడి నుంచి గెలిచిన వారు నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యలను విస్మరించారని కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజల వద్దకు వచ్చేవారని, ఎన్నికల అనంతరం అందుబాటులో ఉండేవారు కాదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాతనే సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలో అనేక అభివృద్ధి పనులు చేపట్టి ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. తాను నిరంతరం ప్రజల మధ్యనే ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని వారి అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేసినట్లు చెప్పారు. ఎన్నో ఏళ్ల నుంచి బేగంపేటలోని ముస్లిం సోదరులు ఖబ్రస్థాన్ ఏర్పాటు చేయాలని కోరుతూ వస్తున్నా ఎవరూ పట్టించుకోలేదని తమ ప్రభుత్వం రెండెకరాల భూమి కేటాయించడంతో పాటు నిర్మాణ పనుల కోసం రూ.3 కోట్లు కూడా విడుదల చేసినట్లు గుర్తు చేశారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో ప్రజలు కారు గుర్తుపై ఓటేస్తారని, ముచ్చటగా మూడోసారి సీఎంగా కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటవుతుందని స్పష్టం చేశారు. ప్రచారంలో కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి, నాయకులు శ్రీహరి, డీపీ నరేందర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, ఆరీఫ్, శేఖర్, అఖిల్ అహ్మద్, మొహినుద్దీన్, జావిద్, ప్రవీణ్ పాల్గొన్నారు.

- మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు మద్దతుగా ఎంఐఎం నేతలు ఇర్ఫాన్, రిజ్వాన్, ఇమ్రాన్‌ఖాన్, మహమూద్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

భోలక్‌పూర్‌లో..

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో మంగళవారం బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. బీఆర్ఎస్ అభ్యర్థి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను గెలిపించాలని బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ పవన్‌కుమార్ గౌడ్, ఏసూరి మహేష్, వెంకటేశన్, వెంకటరమణ, హరిచారీ, సుధాకర్, మహేందర్ ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు.

బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి..



అపార్ట్‌మెంట్ వాసులతో మాట్లాడుతున్న మంత్రి

రాంగోపాల్‌పేట్: దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లలో కాని అభివృద్ధి తెలంగాణ రాష్ట్రం ఏర్పడి తర్వాతనే జరిగిందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. పీజీ రోడ్‌లోని సిల్వర్‌జూబ్లీ అపార్ట్‌మెంట్‌లో నిర్వహించిన గ్రీన్ దివాలీ కార్యక్రమంలో ఆయన పాల్గొని స్థానికులు శుభాకాంక్షలు తెలిపారు. 2014 తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలోనే అన్ని రంగాల్లో రాష్ట్రం అభివృద్ధి చెందిందని అన్నారు. మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ కృషితో హైదరాబాద్ నగరం విశ్వ నగరంగా మారిందని, ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లు, కొత్త రోడ్ల నిర్మాణాలు, ఐటీ పరిశ్రమలతో పాటు వివిధ రకాల పరిశ్రమలు తెలంగాణకు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరి, అపార్ట్‌మెంట్ అధ్యక్షులు బర్కత్ గిలాని, అమీన్‌దత్త, కరీం, ఆజానీ పాల్గొన్నారు.

‘ఆరు గ్యారంటీ’తో ప్రజలకు మేలు



బ్రాహ్మణవాడీలో ప్రచారంలో చేస్తున్న కోటా నీలిమ

సనత్‌నగర్: కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ హామీలతో పేద, మధ్య తరగతి వర్గాలకు ఎంతో మేలు చేకూరుతుందని సనత్‌నగర్ ఆ పార్టీ అభ్యర్థి కోటా నీలిమ అన్నారు. బేగంపేట బ్రాహ్మణవాడీ, సనత్‌నగర్ సుభాష్‌నగర్‌లో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ నాయకులకు చిత్తశుద్ధి లేదని వరద ముంపు శాశ్వత పరిష్కారం జరిగిందని చెబుతున్న నేతలకు ఇక్కడ చిన్నపాటి వర్షానికే నీరు ఇళ్లలోకి చేరుతుండడం కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఆయా బస్తీల సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తున్న నాయకులను ఓడించాలని పిలుపునిచ్చారు. మైనార్టీల సంక్షేమ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందన్నారు.

బీఆర్ఎస్‌కే ప్రజల మద్దతు



ప్రచారం చేస్తున్న లాస్య నందిత

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రజలు సంక్షేమ గులాబీ పార్టీకే జై కొడతారని బీఆర్ఎస్ అభ్యర్థి లాస్య నందిత అన్నారు. మంగళవారం కార్ఖానాలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌తో కలిసి వివిధ ప్రాంతాలకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు, నేతలతో వేర్వేరుగా సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లాస్య మాట్లాడుతూ.. బడుగు, బలహీనవర్గాలతో పాటు మైనార్టీలు, వృద్ధులు, మహిళలు అందరి సంక్షేమం గురించి ఆలోచించే బీఆర్ఎస్ పార్టీకే మరోసారి పట్టం కట్టాలన్నారు. రాష్ట్రంలో ఏర్పడేది గులాబీ ప్రభుత్వమే కాబట్టి.. కంటోన్మెంట్ లోనూ గులాబీ జెండాను గెలిపిస్తే అందరికీ న్యాయం జరుగుతుందన్నారు.

లాస్యకు మద్దతుగా ప్రచారం..

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గంలో మరోసారి గులాబీ జెండా ఎగరవేస్తామని బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జే.లోక్‌నాథ్ పేర్కొన్నారు. మంగళవారం బొల్లారంలోని పలు బస్తీల్లో మార్కెట్ వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, ఇతర నాయకులు, కార్యకర్తలతో లాస్యనందితకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విక్టర్, హెచ్ఎన్. శ్రీనివాస్, మురళీ యాదవ్, పాండురంగరావు, శంకర్ సింగ్, రవికుమార్, అజామ్, సుధాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు. కంటోన్మెంట్ బోర్డు రెండవ వార్డు సీబీఎన్ నగర్‌లో మార్కెట్ మాజీ చైర్మన్ టీఎన్. శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ అభ్యర్థి లాస్యనందితకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించి పార్టీ మేనిఫెస్టో కరపత్రాలను ఇంటింటికి పంచారు.

‘మరోసారి కేసీఆర్ సర్కారే’

కంటోన్మెంట్: రాష్ట్రంలో మరోసారి గులాబీ సర్కారు ఏర్పడటం ఖాయమని తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్ గజ్జెల నాగేశ్ అన్నారు. కంటోన్మెంట్ ఐదో వార్డు పరిధిలోని వాల్మీకినగర్, దుర్గయ్య గార్డెన్స్‌లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడప గడపకు ప్రచారంలో భాగంగా మంగళవారం ఆయన పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం చేస్తూ బీఆర్ఎస్ అభ్యర్థి లాస్య నందితను గెలిపించాలని కోరారు. కేసీఆర్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కంటోన్మెంట్‌లోని వేలాది మంది ప్రజలకు అనేక రకాలుగా ప్రయోజనం చేకూరిందన్నారు. ప్రచారంలో నరేశ్ గౌడ్, శ్రీనివాస్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆకర్షితులై బీజేపీలో చేరికలు



రసూల్‌పురా: ప్రధాని మోదీ చేసిన అభివృద్ధికి ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి బీజేపీలో చేరుతున్నారని బోర్డు మాజీ ఉపాధ్యక్షులు సదా కేశవరెడ్డి అన్నారు. మంగళవారం రసూల్‌పురాలో సదా కేశవరెడ్డి ఆధ్వర్యంలో పలువురు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంటోన్మెంట్ బోర్డు పరిధిలో బీజేపీ కీలక నిర్ణయాలు తీసుకుందని పేదలపై భారం పడకుండా టోల్‌ట్యాక్స్ ఎత్తివేసిందని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఫైనాన్స్ కమీషన్ నిధులు అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. అనంతరం మార్గదర్శి కాలనీలోని స్వామి నారాయణ ఆలయంలో జైన్ సమాజ్ ఆధ్వర్యంలో జరిగిన అన్నకూట్ పూజ కార్యక్రమంలో శ్రీగణేష్, సదా కేశవరెడ్డి పాల్గొన్నారు. అవినాష్ బండారీ రాజేష్, జైన్ మహముని పాల్గొన్నారు.

గెలిపిస్తే పికెట్ రూపురేఖలు మారుస్తా

కంటోన్మెంట్: నగరం నడిబొడ్డున ఉన్నప్పటికీ అభివృద్ధికి దూరంలో ఉన్న పికెట్‌లోని బస్తీల రూపురేఖలు మార్చేందుకు కృషి చేస్తానని కంటోన్మెంట్ కాంగ్రెస్ అభ్యర్థి జీవీ వెన్నెల అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం పికెట్ పరిధిలోని ఫిషర్ పుర, గొల్లబస్తీ, చాకలి బస్తీ, కంటోన్మెంట్ క్వార్టర్స్, లక్ష్మీనగర్, సయ్యద్ జలాల్ గార్డెన్స్, పిట్టల బస్తీ, బ్యాంక్ కాలనీ, లలితానగర్ కాలనీల్లో ప్రచారం నిర్వహించారు. పికెట్ నాలా ఆధునీకరణ ద్వారా సమీప బస్తీలు, కాలనీలకు భారీ ఉపశమనం కలుగుతుందన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే ఈ సమస్య పరిష్కారంపై దృష్టి సారిస్తా అన్నారు.

మైనార్టీలకు అండగా కేసీఆర్ ప్రభుత్వం



సనత్‌నగర్: మైనార్టీలకు కేసీఆర్ ప్రభుత్వం అండగా ఉందని హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. సనత్‌నగర్ అల్లావుద్దీన్ కోఠిలో బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు మద్దతుగా మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. మహమూద్ అలీ మాట్లాడుతూ.. ఉన్నతాభ్యాసం కోసం విదేశాలకు వెళ్లే మైనార్టీ విద్యార్థుల కోసం ప్రభుత్వం రుణాలను అందజేస్తూ గురుకులాలను ఏర్పాటుచేసి వారి విద్యాభ్యాసం కోసం ఎంతగానో కృషి చేస్తోందన్నారు. మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ దమ్మున్న నాయకుడని, సమస్య పరిష్కారం కోసం ఎంతదూరమైనా వెళ్లే అలాంటి నాయకుడు సనత్‌నగర్ ప్రజలకు దొరకడం అదృష్టమన్నారు.

ప్రజల అభ్యున్నతికి నిరంతరం కృషి



మజ్దూర్ యూనియన్ నాయకులతో పద్మారావుగౌడ్

లాలాపేట: ప్రజల ఇబ్బందులను తీర్చిన వారికే ఓటు అడిగే హక్కు ఉందని, నియోజకవర్గ ప్రజలతో మమేకమవుతూ వారి అభ్యున్నతికి నిరంతరం కృషి చేశామని సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఆయన మెట్టుగూడ మున్సిపల్ డివిజన్ పర్యటిస్తూ కారు గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని కోరారు. లంబాడి బస్తీ, విజయపురి కాలనీ, వైట్ హౌజ్, రైల్వే కాలనీ, ఆయిల్ డిపో తదితర ప్రాంతాల్లో పాదయాత్రగా చేస్తుండగా స్థానిక మహిళలు ఆయనకు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ.. గత పదేళ్లగా సికింద్రాబాద్ నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమం సమాంతరంగా సాగుతున్నాయన్నారు. సీఎం కేసీఆర్ విధానాలే తెలంగాణ ప్రజలకు శ్రీరామరక్ష అని పేర్కొన్నారు. ప్రచారంలో డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డి, కార్పొరేటర్లు సునీత కంది శైలజ, సామల హేమ, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రైల్వే కార్మికులకు అండగా ఉన్నాం..

అడ్డగుట్ట: ఎన్నికల ప్రచారంలో భాగంగా సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ కేంద్ర కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్. శంకర్‌రావుతో పాటు పలువురు యూనియన్ నాయకులతో సమావేశమైయ్యారు. అనంతరం పద్మారావుగౌడ్ మాట్లాడుతూ.. రైల్వే కార్మికులకు అనుకూలంగా తమ విధానాలు ఉన్నందున ఎన్నికల్లో తమకే మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. రైల్వే కార్మికులు, ఉద్యోగులు అధికంగా నివసించే సికింద్రాబాద్‌లోని వివిధ రైల్వే కాలనీల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని గతంలో వివిధ సందర్భాల్లో రైల్వే జీఎంలు, కేంద్ర రైల్వే మంత్రులపై ఒత్తిడి తెచ్చామని గుర్తు చేశారు. రైల్వే సిబ్బంది సమస్యల పట్ల తమకు సంపూర్ణ అవగాహన ఉందని, సికింద్రాబాద్‌లో రైల్వే సిబ్బందికి తామే అండగా నిలుస్తున్నామన్నారు.

బీఆర్ఎస్‌కు ఓటమి తప్పదు



ఓటేయాలని కోరుతున్న మర్రి శశిధర్‌రెడ్డి

బన్సీలాల్‌పేట్: సనత్‌నగర్‌లో బీఆర్ఎస్‌కు ఓటమి తప్పదని బీజేపీ అభ్యర్థి మర్రి శశిధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సనత్‌నగర్ ఎమ్మెల్యే, మంత్రిగా తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రజా సమస్యలను పరిష్కరించడంతో విఫలమయ్యారని ఆరోపించారు. అర్హులైన వారికి డబుల్ బెడ్రూమ్ మంజూరు కాలేదని మండిపడ్డారు. సనత్‌నగర్‌లో మంచి కోసం ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీజేపీకి ఓటేయాలని కోరారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర అథోగతి పాలయ్యిందని కాంగ్రెస్ పార్టీ ప్రజల విశ్వాసం కోల్పోయింది దీంతో ప్రజలందరూ బీజేపీ వైపు చూస్తున్నారన్నారు. అంతకు ముందు చాచానెహ్రూనగర్, గాంధీనగర్, అరుణ్‌జ్యోతి కాలనీ ప్రాంతాల్లో మర్రి శశిధర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో పెద్ది రవీందర్, నర్సింగ్ యాదవ్, ఉమేష్ ఖండేల్వాల్, ఎస్. రాజు, వై. సురేష్, గుంటి సత్యనారాయణ, శ్రీకాంత్, నరేష్, ఈశ్వర్, చంద్రపాల్‌రెడ్డి, థామస్ పాల్గొన్నారు.

సికింద్రాబాద్‌లో బీజేపీ జెండా ఎగరవేస్తాం



ప్రచారం నిర్వహిస్తున్న మేకల సారంగపాణి

చిలకలగూడ: సికింద్రాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో విజయం సాధించి బీజేపీ జెండా ఎగరవేస్తామని ఆ పార్టీ అభ్యర్థి మేకల సారంగపాణి అన్నారు. చిలకలగూడ, దూద్‌బావి, అమర్‌టాకీస్ గల్లీ, చింతబావి,ఎన్టీఆర్ నగర్, మైలార్‌గడ్డ తదితర ప్రాంతాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించి తనను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా సారంగపాణి మాట్లాడుతూ.. డబుల్ ఇంజిన్ సర్కార్ కోసం ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని, సికింద్రాబాద్‌తో పాటు తెలంగాణ వ్యాప్తంగా బీజేపీ ఘన విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభంజనంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు గల్లంతు కావడం ఖాయమన్నారు. ప్రచారంలో నాగేశ్వరరెడ్డి, కృష్ణమూర్తి, ప్రభుగుప్తా, కనకట్ల హరి, నాగ భూషణం, రాజేశ్వరరావు, హనుమంతు, మేకల కీర్తి పాల్గొన్నారు.

సమస్యాత్మక కేంద్రాలపై దృష్టి పెట్టాలి

చిలకలగూడ: సికింద్రాబాద్ నియోజకవర్గంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి సారించి, తగిన వసతులు, మౌలిక సదుపాయాలు కల్పించి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలని సికింద్రాబాద్ ఎన్నికల పరిశీలకురాలు ఐఏఎస్ అధికారి గాయత్రికృష్ణన్ ఆదేశించారు. రిటర్నింగ్ అధికారి ఎల్లారెడ్డి, సంబంధిత అధికారులతో కలిసి మంగళవారం నియోజకవర్గంలోని పలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడి పరిస్థితులపై ఆరా తీశారు. పోలింగ్ కేంద్రాల నిర్వహణ, మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. రైల్వే క్వార్టర్స్ ప్రాంతంలోని విద్యావిహార్ హైస్కూల్ పోలింగ్ కేంద్రాలతోపాటు నూతనంగా ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఆయా విభాగాల అధికారులు, స్థానిక పోలీసులతో కలిసి సమన్వయంతో పనిచేయాలన్నారు. సుధాంశు, పాండునాయక్, హేమలత, భుజేందర్‌బాబు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థికి పాస్‌లపై ఉన్న శ్రద్ధ ప్రజలపై ఉండదు



మాట్లాడుతున్న తీన్మార్ మల్లన్న

అడ్డగుట్ట: సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థికి పాస్‌లపై ఉన్న శ్రద్ధ ప్రజలపై ఉండదని కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ కన్వీనర్ తీన్మార్ మల్లన్న విమర్శించారు. మంగళవారం రాత్రి శాంతినగర్‌లో సికింద్రాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి ఆదం సంతోష్ ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలోనే అభివృద్ధి జరిగిందని, నిరుపేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందాయని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేద ప్రజల బతుకులు రోడ్డున పడ్డాయని, కేవలం కల్వకుంట్ల కుటుంబం మాత్రమే సకల భోగాలు అనుభవించారని ఆరోపించారు. పేదప్రజలు కష్టాలు తెలిసిన కాంగ్రెస్ పార్టీ వైపే రాష్ట్ర ప్రజలు మొగ్గు చూపుతున్నారని రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్ ఆదం ఉమాదేవి, కాంగ్రెస్ నేతలు అమర్‌నాథ్, గంట రాజుసాగర్, కిషోర్ యాదవ్, శిల్పాచారి తదితరులు పాల్గొన్నారు.

‘గాంధీ’లో బాలల దినోత్సవం



చిన్నారులతో కలిసి కేక్‌కట్ చేస్తున్న డీఎంఈ రమేష్‌రెడ్డి, రాజారావు

గాంధీఆస్పత్రి : సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి పీడియాట్రిక్ సర్జరీ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ రమేష్ రెడ్డి, సూపరింటెండెంట్ రాజారావు ముఖ్యఅతిథులుగా హాజరై చిన్నారులతో కలిసి కేక్ కట్ చేశారు. చికిత్స అనంతరం కోలుకున్న చిన్నారులకు పలు రకాల ఆటలు నిర్వహించి బహుమతులు అందించారు. మానసిక ఉల్లాసంతో రుగ్మతలు త్వరితగతిన నయం అవుతాయని వైద్యనిపుణులు సూచించారు. గత కొన్నేళ్లుగా క్రమం తప్పకుండా చిల్డ్రన్స్‌డే వేడుకలు నిర్వహిస్తున్నామని గాంధీ పీడియాట్రిక్ సర్జరీ విభాగాధిపతి నాగార్జున తెలిపారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

అడ్డగుట్ట: పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం..ఆర్.కే. పురం కు చెందిన ధీరజ్(25) జొమాటో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 13న బొల్లారం నుంచి గుండ్లపోచంపల్లి రైల్వే స్టేషన్ వెళ్లే మార్గమధ్యలో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

చికిత్స పొందుతున్న వ్యక్తి..

చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సుమారు 40 సంవత్సరాల ఉన్న ఓ వ్యక్తి అనారోగ్య సమస్యతో బాధ పడుతుండగా గుర్తించిన రైల్వే పోలీసులు చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ 14న మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు.

తుకారాంగేట్ పరిధిలో..

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ దయాకర్ వివరాల ప్రకారం.. టీచర్స్ కాలనీలోని జాగృతి అపార్ట్‌మెంట్స్ సమీపంలో సుమారు 50 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి అపస్మారకస్థితిలో పడి ఉన్నట్లు గుర్తించిన స్థానికులు చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించగా మంగళవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

ట్రెక్కింగ్‌కు వెళ్లిన యువకుడి అదృశ్యం



సాయి గజపతిరాజు

అడ్డగుట్ట: బెంగళూరులో ట్రెక్కింగ్‌కు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన యువకుడు అదృశ్యమైన ఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ షాహీద్ పాషా వివరాల ప్రకారం. విజయపురి కాలనీలోని పద్మనాభ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న సాయి గజపతి రాజు(28) ప్రైవేటు ఉద్యోగి. బెంగళూరులో ట్రెక్కింగ్‌కు వెళ్లి మూడు రోజుల్లో తిరిగొస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన గజపతిరాజు పది రోజులు గడుస్తున్నా ఇంటికి తిరిగి రాలేదు. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వస్తుండడంతో భయాందోళనకు గురైన కుటుంబ సభ్యులు, స్నేహితులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో సోదరుడి మంగళవారం ఫిర్యాదు చేశాడు.

యూనివర్సిటీల సమస్యలపై డిక్లరేషన్ చేయాలి

లాలాపేట: రాష్ట్రంలోని యూనివర్సిటీలలో నెలకొన్న సమస్యలపై అన్ని రాజకీయ పార్టీలు డిక్లరేషన్ చేయాలని తెలంగాణ యూనివర్సిటీల జేఏసీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. మంగళవారం ఓయూ ఇంజనీరింగ్ కళాశాల ఎదుట దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. యూనివర్సిటీలో చదివే ప్రతి విద్యార్థికి ఉచిత విద్యా, వసతి సౌకర్యం కల్పించాలని సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులన్నింటిని రెగ్యులర్ కోర్సులుగా మార్చాలన్నారు. యూనివర్సిటీ గ్రాంట్స్‌ను పెంచడంతో పాటు పర్మినెంట్ ప్రొఫెసర్లకు 7వ సవరణ పే స్కేల్ బకాయిలను చెల్లించాలన్నారు.

పురస్కారాల అందజేత



పురస్కారాలు అందుకున్న వారితో నిర్వాహకులు

బన్సీలాల్‌పేట్: అక్షరాలను ప్రేమించిన రచయిత, సమాజహితం కోసం మంచి సాహిత్యాన్ని అందించి, ప్రోత్సహించిన గొప్ప మానవతావాది నిజాం వెంకటేశం అని పలువురు కొనియారు. ప్రముఖ సాహితీవేత్త నిజాం వెంకటేశం జయంతిని పురస్కరించుకొని ఆయన మిత్ర బృందం, కుటుంబ సభ్యులు కలిసి మంగళవారం పద్మారావునగర్‌లో నిజాం వెంకటేశం స్మారక సాహిత్య పురస్కారాలు–2023 ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బీఎస్ రాములు, సాహితీవేత్తలు వింజమూరి సూర్యప్రకాశ్, ఎ. గంగారెడ్డి, ఆడేపు లక్ష్మీపతి, జూకంటి జగన్నాథం, మలిపెద్ది శంకర్ హాజరై మాట్లాడారు. సాహిత్య రంగానికి నిజాం వెంకటేశం చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. రచయితలు డాక్టర్ వి. త్రివేణి, డాక్టర్ ఎం. దేవేంద్ర, గోపగాని రవీందర్, గజ్జెల రామక్రిష్ణ, శిర్పి చంద్రశేఖర్‌లకు పురస్కారాలు అందజేశారు. నిజాం ప్రశాంత్, నిజాం మాధవి పాల్గొన్నారు.